ముగిసిన కీలక ఘట్టం

- నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి
- ఎన్నికల బరిలో అసెంబ్లీకి 29 మంది.. ఎంపీకి 13 మంది..

పార్వతీపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి)/ కురుపాం/ సీతంపేట

ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం పూర్తయ్యింది. బరిలో ఎవరు ఉన్నదీ తేలిపోయింది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను జిల్లా ఎన్నికల అధికారులు సోమవారం విడుదల చేశారు. మొత్తంగా అసెంబ్లీకి 29 మంది, ఎంపీకి 13 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి ఎనిమిది మంది నామినేషన్లు వేశారు. అయితే వారిలో స్వతంత్ర అభ్యర్థి నిమ్మక జయరాజ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. బరిలో ఏడుగురు ఉన్నారు. టీడీపీ నుంచి తోయక జగదీశ్వరి, వైసీపీ నుంచి పాముల పుష్పశ్రీవాణి తదితరులు పోటీలో ఉన్నారు. టీడీపీ అభ్యర్థి తోయక జగదీశ్వరి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లుగా జయరాజ్ తెలిపారు. బీఎస్పీ అభ్యర్థిగా తాడంగి మిన్నారావు, సీపీఎం అభ్యర్థిగా మండంగి రమణ, స్వతంత్ర అభ్యర్థులుగా అడ్డాకుల గీతారాణి, తాడంగి శ్రీహరిరావు నాయుడు, మోసూరు నాగభూషణ్ ఉన్నారు. ఇక పార్వతీపురం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేసిన ఎ.మోహన్‌రావు, పి.అప్పారావు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఇక్కడ మొత్తంగా 8 మంది బరిలో ఉన్నారు. వీరిలో టీడీపీ నుంచి బోనెల విజయచంద్ర, వైసీపీ నుంచి అలజంగి జోగారావు, కాంగ్రెస్ నుంచి బి.మోహన్‌రావు పోటీలో ఉన్నారు. మిగిలిన వారు స్వతంత్ర, పలు పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నారు. నామినేషన్లు ఉపసంహరించుకున్న మోహన్‌రావు, అప్పారావు టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి విజయచంద్ర విజయం కోసం తాము కృషి చేస్తామని ప్రకటించారు. పాలకొండ నియోజకవర్గం నుంచి 12 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా ఇందులో ఐదుగురు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఏడుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ, వైసీపీ అభ్యర్థిగా విశ్వసరాయి కళావతి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున సవర చంటిబాబు, జాతీయ జనసేన పార్టీ తరఫున నిమ్మక జయకృష్ణ, బహుజన సమాజ్ పార్టీ నుంచి ఊయక భానుచందర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కద్రక జైపాల్ ఎన్నికల బరిలో ఉన్నారు. సాలూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి గేదెల రామకృష్ణ తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. బరిలో ఏడుగురు అభ్యర్థులు ఉన్నారు. టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, వైసీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర, కాంగ్రెస్ నుంచి ఎం.పుష్పారావు పోటీలో ఉన్నారు. మిగిలిన ఐదుగురు స్వతంత్రులుగా, వివిధ పార్టీల నుంచి మరికొందరు ఎన్నికల బరిలో నిలిచారు. మొత్తంగా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 29 మంది అభ్యర్థులు ఎన్నికల సమరంలో ఉన్నారు.

బరిలో వైసీపీ రెబల్ అభ్యర్థి..

పార్వతీపురంలో వైసీపీ నాయకుడిగా ఉన్న గర్భాపు మోహన్‌రావు తన నామినేషన్ ఉపసంహరించుకోలేదు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. వైసీపీ సీనియర్ నాయకుడు, టిడ్కో చైర్మన్ జమ్మన్న ప్రసన్నకుమార్‌కు ఆయన ముఖ్య అనుచరుడుగా పేరుంది. దీంతో పార్వతీపురం వైసీపీ అభ్యర్థి అలజంగి జోగారావుకు ఆ పార్టీ నుంచి రెబల్ అభ్యర్థిగా మోహన్‌రావు పోటీలో నిలవడం చర్చనీయాంశంగా మారింది.

ప్రధాన పార్టీల ఎంపీ (అరకు) అభ్యర్థులు

బీజేపీ



కొత్తపల్లి గీత

వైసీపీ



తనూజారాణి

పార్లమెంట్ పరిధిలో..

అరకు పార్లమెంట్ పరిధిలో 13 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ఎన్డీఏ అభ్యర్థిగా బీజేపీ నుంచి కొత్తపల్లి గీత, వైసీపీ అభ్యర్థి తనూజారాణి పోటీలో ఉన్నారు. సీపీఎం పాచిపెంట అప్పలనర్సయ్య, స్వతంత్ర అభ్యర్థులుగా మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, పాలక రంజిత్‌కుమార్, అతిథి, మండల గిరిధరరావు, సమ్మిరెడ్డి బాలకృష్ణ పోటీ చేస్తున్నారు. ఇండియా ప్రజాందు పార్టీ నుంచి వి.నిరక్షన్, బహుజన సమాజ్ పార్టీ నుంచి ఆవశ్యలహరి, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి బి.చంటి, భారత్ ఆదివాసీ పార్టీ నుంచి ఎంరాజుబాబు, తెలుగు రాజాధికార సమితి పార్టీ నుంచి జల్లి రాంబాబుతో పాటు మరికొందరు బరిలో ఉన్నారు.

ప్రధాన పార్టీల అసెంబ్లీ అభ్యర్థులు

టీడీపీ | వైసీపీ | కాంగ్రెస్

పార్వతీపురం



బోనెల విజయచంద్ర



అలజంగి జోగారావు



బి.మోహన్‌రావు

సాలూరు



గుమ్మిడి సంధ్యారాణి



పీడిక రాజన్నదొర



ఎం.పుష్పారావు

కురుపాం



తోయక జగదీశ్వరి



పాముల పుష్పశ్రీవాణి



ఎం.రమణ(సీపీఎం)

పాలకొండ



నిమ్మక జయకృష్ణ (జనసేన)



వి. కళావతి



సవర చంటిబాబు

ఆ హామీ ఏమైంది?

- సీతానగరం వద్ద వంతెన నిర్మాణానికి జగన్ హామీ
- ఐదేళ్ల పాలనా కాలంలో పూర్తిచేయని వైనం
- సకాలంలో బిల్లులు చెల్లించని సర్కారు
- అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులు
- వాహనదారులకు తప్పని అవస్థలు



సీతానగరం, ఏప్రిల్ 29: 'సీతానగరం సమీపంలోని సువర్ణముఖి నదిపై వంతెన నిర్మాణం చేపడతాం.. వాహనదారులు, ప్రయాణికుల కష్టాలు తీరుస్తాం..' అని 2018, నవంబరులో ఆ వంతెన మీదుగా పాదయాత్ర చేపట్టిన జగన్ ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట పూర్తిగా మారిచారు.. ఐదేళ్లు గడిచినా.. ఆ హామీ నెరవేర్చలేదు. వంతెన నిర్మాణానికి చొరవ చూపలేదు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారికి నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. 'మాట తప్పను.. మడమ తిప్పను' అని గొప్పలు చెప్పుకునే సీఎం జగన్ ప్రకటనలకే పరిమితమవడంపై ఈ ప్రాంతవాసులు, వాహనదారులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా నుంచి బొబ్బిలి-రాయగడ అంతర్రాష్ట్ర రహదారిలో సీతానగరం వద్ద సువర్ణముఖీ నదిపై ఉన్న బ్రిటిష్ కాలం నాటి వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఇది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో నూతన వంతెన నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అడుగులు పడ్డాయి. అప్పట్లో సుమారు రూ.12 కోట్లు మంజూరు చేశారు. ఆ తర్వాత శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయితే ఇంతలోనే ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మారింది. వంతెన నిర్మాణానికి బ్రేక్ పడింది. ఈ లోపుగా పాత వంతెన పరిస్థితి మరింత అధ్వానంగా మారడంతో 2020, జూలైలో నూతన వంతెన నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మరోవైపు పాత వంతెనకు కూడా మరమ్మతులు చేపట్టారు. అయితే వైసీపీ సర్కారు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో.. పనులు పూర్తిగా నిలిపివేయకూడదని ఉద్దేశంతో వంతెనకు ఇరువైపులా ఎప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేశారు. కాగా సుమారు ఏడాది గడుస్తున్నా సర్కారు బిల్లులను చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పూర్తిగా చేతులెత్తేశారు. దీంతో వంతెన పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో 36వ రాష్ట్రీయ రహదారిపై వంతెన నిర్మాణం ఎప్పటికీ పూర్తవుతుందో.. తెలియని పరిస్థితి ఏర్పడింది.

తప్పని ఇక్కట్లు

వంతెన పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. దాదాపు పన్నెండు నెలలుగా నిర్మాణం సాగకపోవడంతో శిథిలావస్థలో ఉన్న పాత వంతెనపై నుంచే వాహనాలు రాకపోకలు సాగుతున్నాయి. ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 2,500 వాహనాలు రోజూ ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. పాత వంతెనలపై 20 టన్నులకు పైబడి బరువున్న వాహనాలు రాకపోకలను నిషేధించి నప్పటికీ అది అమలు కావడం లేదు. అరవై టన్నులు పైబడిన బరువు కలిగిన వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ సింగిల్ వేలో వంతెనపై ఓ వాహనం వస్తే.. ఎదురుగా వచ్చే వాహనం బ్రిడ్జికి అవతల వైపు కొద్దిసేపు ఆగాల్సిన పరిస్థితి. ఒక్కోసారి ఎదురెదురుగా వచ్చే వాహనాలు వంతెన మధ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. కాగా పాతవ వంతెన శిథిలావస్థకు చేరుకోగా.. దీనిపై వాహన రాకపోకలు అంత సురక్షితం కాదు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. దీనిపై అర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా.. వంతెన పనులకు సంబంధించి సుమారు రూ.5 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటికే రూ.3.5 కోట్లు చెల్లించామని, పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఇబ్బందులు పడుతున్నాం..

పాత వంతెన సింగిల్ వే కావడంతో భారీ వాహనాలు వచ్చే సమయంలో బ్రిడ్జీ అవతల వైపు వేచి ఉండాల్సి వస్తోంది. ఒక్కోసారి ఎదురెదురుగా వాహనాలు వచ్చి వంతెన మధ్యలో నిలిచిపోవడంతో గంటకొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతుంది. దీంతో ప్రయాణికులతో నిరీక్షించలేక పోతున్నాం. ఈ మార్గంలో రాకపోకలు సాగించలేకపోతున్నాం. నిత్యం ఇబ్బందులు పడుతున్నాం.

- ఎ.ఈశ్వరరావు,
ఆటో డ్రైవర్,
సీతానగరం మండలం



వంతెన నిర్మాణం ఇలా..

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్

పార్వతీపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకరించాలని పార్లమెంటరీ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్ద కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశాల్లో ఎన్నికల ప్రచార రాతలు ఉండరాదన్నారు. ప్రచారంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నియమావళిని పక్కాగా పాటించాలని సూచించారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రచారానికి ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో పాడేరు, అరకు, రంపచోడవరంలోనే అనుమతులు పొందడానికి అవకాశం కల్పించామని తెలిపారు. సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేనప్పుడు వాట్సాప్ , ఫ్యాక్స్ రూపంలో కూడా దరఖాస్తులు ఇవ్వొచ్చన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వివిధ పరిస్థితుల దృష్ట్యా పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం మే 11వ తేదీ సాయంత్రం నాలుగు గంటలతో ముగుస్తుందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు, పార్వతీపురం నియోకవర్గంలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు ప్రమోద్‌కుమార్, కలెక్టర్ నిశాంత్‌కుమార్

అంకితభావంతో పనిచేయాలి: డీఎంహెచ్‌వో

పాలకొండ: అంకితభావంతో వైద్య సిబ్బంది పనిచేయాలని డీఎంహెచ్‌వో జగన్నాథరావు సూచించారు. అన్నవరం పీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాలను సోమ వారం ఆయన సందర్శించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు, గర్భిణులతో మాట్లాడి తగు సూచనలిచ్చారు. ఎంసీపీ కార్డులో వైద్య పరీక్షల వివరాలు పరిశీలించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యాన్ని తరచుగా పర్యవేక్షిం చాలని, పీహెచ్‌సీలో సాధారణ కాన్పులు జరగాలని, వాక్సిన్ నిల్వలను పరిశీలించాలని ఆదేశించారు. కాలపరిమితి దగ్గరగా ఉన్న మందులను ముందుగా వినియోగించు కోవాలని, వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ లభ్యతను అడిగి తెలుసుకోవాలని సూచించారు.



ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మళ్లీ ఇబ్బందులు పడాలా?

- పింఛనుదారులను అవస్థలకు గురిచేసేలా వైసీపీ చర్యలు
- బ్యాంకుల్లో పింఛన్ సొమ్ము జమకు సర్కారు ఆదేశాలు
- లబ్ధిదారులను ఇక్కట్లకు గురిచేసి.. ఆ నెపాన్ని ప్రతిపక్షాలపై వేసే కుట్ర
- ప్రభుత్వ నిర్ణయంపై జిల్లావాసుల మండిపాటు
- సచివాలయ, ఇతర సిబ్బందితో ఇంటింటికీ పంపిణీ చేయాలని డిమాండ్



పార్వతీపురం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ సర్కారు మరో ఎత్తుగడకు తెరతీసింది. బ్యాంకుల్లో పింఛన్ సొమ్ము జమ చేస్తామంటూ ప్రకటించి మరో దారుణమైన నిర్ణయం తీసుకుంది. ఎక్కడో దూరంలో ఉండే బ్యాంకుల వద్ద మండుటెండలో పింఛన్‌దారులు పడిగాపులు కాసేలా కుట్రపన్నింది. మొత్తంగా మళ్లీ పింఛన్‌దారులను ఇబ్బందులకు గురిచేసి ఆ నెపాన్ని విపక్షాలపై వేసేందుకు వైసీపీ సర్కారు ప్రయత్నిస్తోంది. మొత్తంగా వచ్చేనెల సామాజిక పింఛన్ల సొమ్మును పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలివ్వడంపై జిల్లావాసులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు మండిప డుతున్నారు. పింఛనుదారులతో రాజకీయాలేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపక్షాలపై తప్పు తోసి వైసీపీకి మేలు చేసే విధంగా సీఎస్ ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు.

ఇదీ పరిస్థితి...

గత నెలలో జిల్లాలో ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేశారు. కొతమంది సచివాలయాలు వచ్చినప్పటికీ .. అత్యధిక శాతం పింఛన్‌దారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛన్లు అందించారు. అయితే మే నెలలో అలా ఎందుకు అందించరని పలువురు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకులో పింఛను సొమ్ము జమ చేయడం ఏమిటి? బ్యాంకులకు వెళ్లలేని వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇస్తామనడం వెనక అసలు కారణాలేమిటని మండిపడుతున్నారు. సచివాలయ, ఇతర సిబ్బంది ద్వారా పింఛన్‌దారులందరి ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ ఇస్తే నష్టం ఏమిటని ధ్వజమెత్తుతున్నారు. ఏదేమైనా వైసీపీ రాజకీయ లబ్ధి కోసమే ఇదంతా చేస్తున్నారని మరికొంతమంది ఆరోపిస్తున్నారు. సరిపడా సిబ్బంది ఉన్నప్పటికీ ఇంటింటికీ పింఛన్ల పంపిణీకి సర్కారు కావాలనే మోకాలడ్డుతోందని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలపైనే నమోదవుతున్న నేపథ్యంలో దూర ప్రాంతాల్లో ఉన్న బ్యాంకులకు సామాజిక పింఛనుదారులు వెళ్లి పింఛన్ పొందాలంటే ఇబ్బందులు ఎన్నో. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే..

- బలిజిపేటలో ఉన్న బ్యాంకుకు వచ్చి పెన్షన్ సొమ్ము విత్‌డ్రా చేయాలంటే ఆ మండలంలో నూకలవాడ గ్రామం నుంచి ఐదు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. దీనికి రానుపోను ఆటో చార్జీలతో పాటు ఎండ వేడిని కూడా పింఛన్ దారులు తట్టుకోవాల్సి ఉంది.
- పార్వతీపురం మండలం అడారు గ్రామం నుంచి పెదబండపల్లిలో ఉన్న ఏపీజీవీబీ నుంచి పింఛన్ సొమ్ము విత్ డ్రా చేయాలంటే సుమారు ఐదు కిలోమీటర్లు పైబడి ప్రయాణించాల్సి ఉంది.
- ఏజెన్సీ మండలాలైన గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, కురుపాం, మక్కువ, పాచిపెంట తదితర మండలాల నుంచి పింఛనుదారులు వచ్చి బ్యాంకుల్లో నగదు విత్ డ్రా చేయాలంటే.. ఒక రోజు సమయం పట్టనుంది. పైగా ప్రయాణ చార్జీలు, మధ్యాహ్న భోజనం తదితర ఖర్చులన్నీ వారు భరించా ల్సి ఉంది. ఇక నిరక్షరాస్యులైన సామాజిక పింఛన్ దారులు ఎవరో ఒకరి తోడుతో బ్యాంకులకు వెళ్లాల్సిన పరిస్థితి.

సీతంపేట మండలంలో..

సీతంపేట: ఈ మండల కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పింఛన్‌దారులు తప్పనిసరిగా సీతంపేటలో ఉన్న బ్యాంకులకు రావాల్సి ఉంది. పొల్ల, మానాపురం, టిటికుపాయి, గులుమూరు, పూతికవలస, మర్రిపాడు, తాలాడ, పల్లంకి పంచాయతీలు సీతంపేట మండల కేంద్రానికి 20 కిలోమీటర్లు దూరంలో ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి పింఛను దారులు బ్యాంకులకు వచ్చి నగదు డ్రా చేయాలంటే తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేదు. ప్రైవేట్ వాహనాలకు రూ. 100 చెల్లించి మండు టెండలో బ్యాంకులకు రావల్సి ఉంది. తీరా బ్యాంకులకు వస్తే.. రూ.20 వేల వరకు నగదును నేరుగా చెల్లించని నేప థ్యంలో సర్వీస్ సెంటర్ల ద్వారా చెల్లించడం వల్ల పెన్షన్‌దారులు పడిగాపులు పడాల్సి ఉంది.

నెట్‌వర్క్‌లేని గ్రామాలెన్నో..

సీతంపేట మండలంలో సుమారు పది వేల మంది పెన్షన్‌దారులు ఉండగా అధికశాతం కొండ శిఖర ప్రాంతాలు సుదూర ప్రాంతాలకు చెందినవారే. ఇప్పటికే 200 గ్రామాలకు నెట్‌వర్క్ సౌకర్యం లేదు. దీంతో బ్యాంకు ఖాతాలో పింఛన్ సొమ్ము జమైందనే విషయం వారికి తెలియదు. ఫోన్లకు ఎటువంటి మెసేజ్‌లు వచ్చే అవకాశం లేకపోవడంతో పింఛను దారుల్లో గందరగోళం నెలకొంది. ఇప్పటికీ గిరిజన గ్రామాల్లో కొంతమంది ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. మరి కొందరు జీడిపిక్కలు, కొండ చీపుర్ల సేకరణలో బిజీగా ఉన్నారు. అయితే ఈ సమయంలో పింఛన్ల డబ్బుల కోసం వారు బ్యాంకులకు వెళ్లాలంటే ఒక పూట పని పోయినట్లే. మరోవైపు ఎండల నేపథ్యంలో వైసీపీ సర్కారు తీరుపై వారు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా గిరిజన ప్రాంతాల్లో చాలామందికి బ్యాంకు లావాదేవీలు సక్రమంగా లేక ఖాతాలు స్తంభించిన పరిస్థితి ఉంది. ఇటువంటి వారికి పింఛన్ ఎలా అందుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో అమ్మ ఒడి, ఆసరా, రైతు భరోసా వంటి నిధులు కూడా సకాలంలో తీయలేకపోవడంతో అప్పటికే ఉన్న రుణాల కింద బ్యాంకర్లు వాటిని జమ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకుల్లో పెన్షన్ జమపై గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

పీపుల్స్ మేనిఫెస్టో

భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలి



గరుగుబిల్లి: భవిష్యత్‌కు భరోసా కల్పించే వారికే ప్రాధాన్యం ఇస్తాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే నాయకుడికే మద్దతు ఉంటుంది. ఎన్నికల సమయంతో నేతల హామీలు కార్యరూపం దాల్చడం లేదు. ఓటు వేసేంత వరకు ఒకలా.. ఆ తరువాత మరొకలా వ్యవహరిస్తున్నారు. ప్రజా ఓట్లతో సమస్యలు పరిష్కరించాలి తప్ప స్వార్థానికి పదవిని ఉపయోగించకూడదు. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగొద్దు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపించే పార్టీని ఆదరించి... భవిష్యత్‌కు ప్రాధాన్యం ఇచ్చేవారికే ఓటు వేయాలి.

- కండే బలరాంనాయుడు, మరుపెంట, గరుగుబిల్లి మండలం

ఓటు.. మన హక్కు

(కొమరాడ)

18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడికీ రాజ్యాంగం ఓటు హక్కు ప్రసాదించింది. ప్రతి ఓటరూ తమ హక్కును వినియోగించుకోవాలి. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్, మేధావులు, రాజకీయ పార్టీలు పదే పదే చెబుతుంటాయి. ఒక్కో నియోజకవర్గంలో చాలామంది ఎన్నికల బరిలో ఉంటారు. అభ్యర్థులకు ఓటు వేయడం ఇష్టం లేకపోతే చివరి వరుసలో ఉన్న నోటా బటన్ నొక్కితే సరిపోతుంది. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారిగా కేంద్ర ఎన్నికల సంఘం నోటాకు అవకాశం కల్పించింది.



అప్పట్లో నిజాయతీపరులకే అవకాశం దక్కేది

(సాలూరు రూరల్)

పెద్దుల మాట

గతంలో ఎన్నికల్లో నిజాయితీపరులకే అవకాశం దక్కేది. పోటీ చేసే వారి వ్యక్తిత్వాన్ని ప్రజలు గమనించేవారు. ఎమ్మెల్యేలు అయినా హంగు, ఆర్భాటం ఉండేవి కావు. ఓటు వేయడానికి ఉదయాన్నే పోలింగ్ బూత్‌కు నడిచి వెళ్లేదాన్ని. ఓటు వచ్చిన దగ్గర నుంచి అన్ని ఎన్నికల్లో ఓటు వేస్తున్నాను. రిక్షాలకు మైక్‌లు కట్టి అప్పుడు ప్రచారం చేసే వారు. ప్రచారానికి ఇంత కష్టపడేవారు కాదు. ఇప్పుడు ఇంటింటికి వచ్చి ఓటు అడుగుతున్నారు. ఓటరుకు ఇప్పుడు గౌరవం పెరిగింది. ప్రచార ఆర్భాటాలు పెరిగాయి. ఓటును ప్రతి ఒక్కరు వేయాలి. ఓటు వేయడానికి వరుసలో నిలబడానికి విసుగు చెందకూడదు. ఐదేళ్లకు వచ్చే ఎన్నికల్లో ఓటు వేయడానికి బద్ధకిస్తే ఎలా? అందరూ ఓటు వేయాలి. నాకు నచ్చిన వారికి ఓటు వేస్తాను.

- కోలా అచ్చియ్యమ్మ (86), సాలూరు



ఆమె ఓటే శాసనం

- ఆరు నియోజకవర్గాల్లో మహిళలే అధికం
- సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ ఆశలు
- ఆ పార్టీ వైపే మొగ్గు చూపుతున్న నారీమణులు

(రాజాం రూరల్)

విజయనగరం జిల్లా రాజకీయ పరమపద సోపాన పటంలో ఎవరికి నిచ్చెనలు ఎక్కించాలో.. ఎవరికి చట్టసభలకు పంపించాలో.. ఎవరికి అధికారయోగం కల్పించాలో.. ఈసారి మహిళలే నిర్ణయించనున్నారు. అభ్యర్థుల గెలుపు ఓటముల్లో మహిళలే కీలక పాత్ర పోషించబోతున్నారు. రాజకీయ చరిత్రను కొత్తమలుపు తిప్పబోతున్నారు. జిల్లాలో ఏడింట ఆరు నియోజకవర్గాలలో మహిళలే అధికంగా ఉన్నారు. వారి కరుణా కటాక్షాలు పొందేందుకు పార్టీలు... అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. మహిళల కోసం పార్టీలు ప్రవేశపెట్టే పథకాలు కూడా విజయంలో కీలకం కానున్నాయి. ఎన్నికలలో తమ ఓటే శాసనమని.. ఓటరు జాబితాలో నమోదైన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

జిల్లాలో..

వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో రాజాం మినహా విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం, చీపురుపల్లి, నెల్లిమర్ల, ఎస్.కోట నియోజకవర్గాలలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఫలితాలను ప్రభావితం చేసే శక్తి స్త్రీలకే ఎక్కువగా ఉంది. మహిళలు రాజకీయ రంగంలో రాణించడమే కాకుండా ఎన్నికల సమయంలో అభ్యర్థుల అనుకూల, ప్రతికూల పరిస్థితులను కూడా లెక్కలు వేస్తున్నారు. మగువలు ఎవరివైపు మొగ్గు చూపితే వారికే అధికారం వచ్చే అవకాశం ఉంది. అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ హోరాహోరీగా ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో మహిళా ఓటర్లు ఎవరి గెలుపునకు దోహదపడతారో చూడాలి.



సూపర్ సిక్స్ పథకాలపై మహిళల మక్కువ

గతానికి భిన్నంగా టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై జిల్లా అంతటా చర్చ జరుగుతోంది. ఏ ఇద్దరు మహిళలు మాట్లాడుకున్నా బాబు అమలు చేస్తామని ప్రకటించిన పథకాలపైనే చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వం మహిళలకు ఇచ్చే నాలుగు రూపాయల కంటే.. టీడీపీ ప్రకటించిన పథకాలతో శాశ్వత ప్రయోజనం కలుగుతుందన్న వాదన జిల్లా అంతటా మహిళల్లో బలంగా వినిపిస్తోంది.

ఏడాదికి రూ.15 వేలు

స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించడంపై మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందికీ రూ.15 వేలు వంతున ఇస్తామన్న బాబు ప్రకటన మహిళల్లో కొత్త ఆలోచనకు తెరలేపింది. వైసీపీ ప్రభుత్వం సైతం ఇదే మాదిరిగా ప్రకటించినా... తొలి ఏడాదికే పరిమితం కావడంపై మహిళల్లో చర్చ కొనసాగుతోంది.

జిల్లా రాజకీయాలను మహిళలు శాసించబోతున్నారు. పార్టీల గెలుపు రాతను నారీమణులే రాయబోతున్నారు. అభ్యర్థుల విజయావకాశాలను వారే నిర్ణయించబోతున్నారు. వారి కరుణపొందిన వారే అధికారం చేపట్టబోతున్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళల ఓట్లు ఎక్కువ. వారి ఓట్లే అభ్యర్థుల బలాబలాలను నిర్ణయించబోతున్నాయి.

జిల్లాలో ఇలా..

మొత్తం ఓటర్లు:	15,41,201
పురుషులు:	7,60.400
మహిళలు:	7,80,518
థర్డ్ జెండర్:	83

జిల్లాలో మహిళా ఓటర్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు
విజయనగరం	1,21,235	1,28,312
గజపతినగరం	99,745	1,03,576
బొబ్బిలి	1,13,027	1,15,791
చీపురుపల్లి	1,01,574	1,01,595
నెల్లిమర్ల	1,04,676	1,06,874
ఎస్.కోట	1,07,188	1,13,117
రాజాం	1,12,955	1,11,253



ఉచిత గ్యాస్ సిలిండర్లు

ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న తెలుగుదేశం ప్రకటన మహిళామణులకు వరంగా మారనుందన్న ప్రచారం సాగుతోంది. వైసీపీ ప్రభుత్వంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.1100 దాటిన నేపథ్యంలో మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామనడంపై మహిళలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలలో ఉచిత సిలిండర్ల ప్రకటన కారుచీకట్లో కాంతిపుంజంలో కనిపిస్తోంది.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం..

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న చంద్రబాబు ప్రకటన మహిళల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ప్రస్తుత ప్రభుత్వంలో పెట్రో ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటిన నేపథ్యంలో ఆర్టీసీ ఛార్జీలు భారీగా పెరగడం.. ఆటో ఎక్కితే మినిమం ఛార్జీ రూ.20 పలుకుతున్న వేళ... ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించవచ్చన్న ఆలోచన వారిలో టీడీపీ ప్రభుత్వానికి మద్దతు పలకాలన్న ఉత్సాహం నింపుతోంది. ఈసారి తెదేపా అభ్యర్థులను గెలిపించుకోవాలన్న కసి వారిలో స్పష్టంగా కనిపిస్తోంది.

ఆశల పల్లకిలో యువత

యువతో కొంగొత్త ఆశలు కనిపిస్తున్నాయి. అయిదేళ్లలో 20 లక్షల ఉపాధి అవకాశాలు, లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి కల్పించే లక్ష్యంతో టీడీపీ సిద్ధం చేసిన మేనిఫెస్టో పట్ల యువత ఆకర్షితులవుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమైన నేపథ్యంలో తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉన్న యువత టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారు.

నిఘాపై నిఘా

- ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు

(శృంగవరపుకోట)

ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు శనివారం సాయంత్రం సీసీ కెమెరాలను అమర్చింది. నిఘా అధికారులపైనే నిఘా పెట్టింది. దీంతో ఇప్పుడు ఈ నిఘా బృందాలు ఎక్కడా అలసత్వం వహించకుండా పని చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఎవరైనా తప్పుడు మార్గంలో వెళ్లినా ఈ సీసీ కెమెరాలు గుర్తించేస్తాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు డబ్బు, బంగారం, చీరలు, ఇతర విలువైన వస్తువులు తరలించడం పరిపాటి. ఇలా రవాణా కాకుండా అడ్డుకునేందుకు నియోజకవర్గానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఎన్నికల సంఘం నియమించింది. ఈ వాహనాలు నియోజకవర్గ పరిధిలోని రోడ్డు మార్గంలో వేళ్లే ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలి. వీడియో గ్రాఫర్‌తో రికార్డు చేయాలి. ఇదంతా పక్కాగా జరగాలి. అయితే కొన్ని చోట్ల ఈ నిఘా అధికారులను తప్పించుకొని పారిపోవడం... వారిపై తిరగబడడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఒక పోలీసు కానిస్టేబుల్, ఒక మండల స్థాయి అధికారి, ఒక వీడియో గ్రాఫర్, వాహన డ్రైవర్ నలుగురే కావడంతో వారిని అడ్డుకోలేక అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల క్రితం లక్కవరపుకోట మండలం వీరభద్రపేట వేళ్లే రోడ్డులో ఇలాంటి సంఘటన జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు దీనిపై కేసు నమోదు చేయలేదని తెలుస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనం ముందు భాగంలో ఎన్నికల అధికారులు సీసీ కెమెరాలను అమర్చారు. ఇది వాహనాల రాకపోకలు, వీటిని తనిఖీ చేసే విధానంతో పాటు అక్కడ జరిగే ప్రతి సంభాషణను రికార్డు చేస్తుంది. ఇదంతా కలెక్టరేట్ ఎన్నికల కంట్రోల్ రూంలో దృశ్య రూపంలో కనిపించడంతో పాటు శబ్ద రూపంలో వినిపిస్తుంది. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఏం మాట్లాడినా రికార్డవుతుంది. వాహనం దగ్గర లేకున్నా తెలిసిపోతుంది. వాహనం ఎక్కడ ఉందో సీసీ కెమెరా ద్వారా కలెక్టరేట్ ఎన్నికల కంట్రోల్ రూం అధికారులు, సిబ్బంది చెప్పగలరు. ఇప్పుడు నిఘాపై నిఘాను ఏర్పాటు చేయడంతో డబ్బు, వస్తువులు తరలించే వారితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జాగ్రత్తలు పాటించక తప్పదు.



వాహనానికి అమర్చిన సీసీ కెమెరా



వీఆర్‌పేట సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనానికి బిగించిన సీసీ కెమెరా

షాపులు తెరవద్దు

- జగన్ పర్యటన కోసం పోలీసు మార్కు హుకుం
- వైసీపీ నాయకుల సేవలో వలంటీర్లు

బొబ్బిలి, ఏప్రిల్ 29: బొబ్బిలి పట్టణంలో బుధవారం ఉదయం సీఎం జగన్ నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభ కోసం పోలీసులు తమ మార్కు హుకుం జారీ చేశారు. బొబ్బిలి పట్టణంలోని శ్రీకళాభారతి ఆడిటోరియం జంక్షన్‌లో సీఎం సభ నిర్వహించనున్నారు. స్థానిక రాజా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుంచి సీఎం రోడ్డు మార్గంలో సభాస్థలికి చేరుకోనున్నారు. ఈ మార్గంలో గల అన్ని రకాల షాపులు, వ్యాపార సంస్థలను ఆ రోజు మూసివేయాలని పోలీసులు వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కోర్టు జంక్షన్ వరకు కుడి పక్కన గల షాపులన్నీ బొబ్బిలి రాజులకు చెందిన స్థలాల్లో ఉండడంతో వారంతా తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులుగా ఉండవచ్చని అధికార పార్టీ నాయకుల నమ్మకం. దీనితో సీఎం పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తుగా వ్యాపార సంస్థల నిర్వాహకులను పోలీసులు హెచ్చరిస్తూ వాటిని మూసివేయాలని హుకుం జారీ చేశారు. దీనిపై వ్యాపారవర్గాల వారు విస్తుపోతున్నారు. సీఎం ఎన్నికల ప్రచారం కోసం వస్తే తమ షాపులు ఎందుకు మూసెయ్యాలి అని వారు ప్రశ్నిస్తున్నారు.

వలంటీర్ల సేవలు...

సీఎం జగన్ ఎన్నికల ప్రచారానికి పెద్ద సంఖ్యలో జనాన్ని తరలించేందుకు వలంటీర్ల సేవలను వైసీపీ నాయకులు వినియోగించుకుంటున్నారు. బొబ్బిలి పట్టణంలోని అన్ని వార్డులు, మండలం లోని గ్రామాలలో రాజీనామా చేసిన వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి సీఎం సభకు రావాలని ప్రజలను కోరుతున్నారు. రాజీనామాలు చేసేశారు కదా...మీకెందుకు ఈ పనులు అని నిలదీస్తుండడంతో వలంటీర్లు కంగుతింటున్నారు. తెలుగు దేశం పార్టీ అధికారంలోనికి రాగానే మంచి భవిష్యత్ ఉంటుందని చంద్ర బాబు-పవన్‌లు భరోసా ఇస్తుంటే మళ్లీ జగన్ ఉచ్చులో పడతారేమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



షాపుల మూసివేత స్వచ్ఛందమే

సీఎం పర్యటన సందర్భంగా దారి పొడవునా గల షాపులను మూసివే యాలన్నది పూర్తి స్వచ్ఛందమే తప్ప నిర్బంధం ఏమీ లేదు. గతంలో చంద్రబాబు బొబ్బిలి పర్యటనకు వచ్చినప్పుడు షాపుల నిర్వాహకులంతా స్వచ్ఛందంగానే మూసివేశారు. ఇప్పుడు అలాగే జరుగుతోంది తప్ప.. పోలీసుల హుకుం... అధికార పార్టీ జులుం వంటివేమీ లేవు.

- నాగేశ్వరరావు, సీఐ, బొబ్బిలి

హలో.. ఓటేసేందుకు రండి



- వలస ఓటర్లపై పార్టీల దృష్టి
- ఫోన్ చేసి రప్పించేందుకు సన్నాహాలు
- స్థానిక నేతలతో సమాచారం

(గరుగుబిల్లి)

సార్వత్రిక ఎన్నికల సమరం ఊపందుకుంటోంది. పోలింగ్‌కు ఇంకా రెండు వారాలు సమయం మాత్రమే ఉండడంతో క్రమేణా గ్రామాలు రాజకీయవాతావరణంతో వేడెక్కుతున్నాయి. గెలుపునకు అధికార, ప్రతిపక్ష పార్టీల గ్రామస్థాయి నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. ఎలాగైనా గెలవాలని భావించి ప్రతి ఓటును కీలకంగా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉపాధి లేక వలస బాట పట్టిన ఓటర్లపై పార్టీలు దృష్టి సారించాయి. దీంతో గ్రామ స్థాయిలో నాయకుల నుంచి వలస ఓటర్ల సమాచారాన్ని సేకరించి ఎన్నికల పోలింగ్ నాటికి స్వగ్రామాలకు రప్పించేందుకు సన్నాహాలు అప్పుడే ప్రారంభించారు. శాసనసభతో పాటు పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ పూర్తవడంతో ప్రధాన పార్టీలు తమ అనుకూల ఓటర్ల వివరాలను స్థానిక నాయకులు, ముఖ్య కార్యకర్తలు ద్వారా తెలుసుకొని ఫోన్‌లో వారితో మాట్లాడుతూ పోలింగ్‌కు రావాలని కోరుతున్నారు. అనేక గ్రామాల నుంచి వందల సంఖ్యలో ఉపాధి కోసం నగర, పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లారు. పోలింగ్ నాటికి వస్తారో, రారో అన్న అనుమానంతో ముందస్తుగా వారికోసం ఆరా తీస్తున్నారు. ఓటుహక్కును వినియోగించుకోవడమే కాకుండా అది మనకు అనుకూలం అవుతుందన్న ఆశతో అభ్యర్థుల సూచనలతో అప్పుడే వలస ఓటర్లతో సంభాషణలు చేస్తూ వారు వచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



జన కేతనం
ఆంధ్రజ్యోతి మంగళవారం 30 ఏప్రిల్ 2024

చరిత్రలో కలిసిపోయాయి!

- 2009లో ఐదు నియోజకవర్గాలు రద్దు
- ఉద్దండులకు చట్టసభల్లో అవకాశం
- జిల్లాలో తగ్గిన శాసనసభ స్థానాలు

(శృంగవరపుకోట)

ప్రస్తుతం విజయనగరం జిల్లాలో మనం చూస్తున్న కొన్ని నియోజవర్గాలు 2009కి ముందు లేవు. అప్పట్లో వేరే నియోజకవర్గాలు ఉండేవి. వాటిలో కొన్ని కనీసం మండల కేంద్రాలు కూడా కాని గ్రామాలు. ఉత్తరాపల్లి, సతివాడ, నాగూరు నియోజకవర్గాల పేర్లు వినే ఉంటారు. ఇలా నియోజకవర్గాల పేరు మీద ఉన్న గ్రామాలు చిన్నవి. 2009 శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనతో ఇవన్నీ రద్దయ్యాయి. వీటితో పాటు తెర్లాం, భోగాపురం నియోజకవర్గాలు తెరమరుగయ్యాయి. ఈ రెండు నియోజకవర్గాల కేంద్రాలు ప్రస్తుతం మండల కేంద్రాలుగా ఉన్నాయి. ఇలా ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఐదు శాసన సభ నియోజకవర్గాలు చరిత్రపుటల్లో కలసిపోయాయి. అంతకుముందుర 12 నియోజకవర్గాలు ఉండగా...ఆ సంఖ్య 9కి తగ్గింది. శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉన్న రాజాం నియోజకవర్గం కొత్తగా విజయనగరం జిల్లాలో చేరింది. ఈ నియోజకవర్గ పరిధిలోని రేగిడి ఆమదాలవలస మండల పరిధిలో ఉన్న ఉణుకూరు పేరు మీద ఓ నియోజకవర్గం ఉండేది. మాజీ మం త్రులు కోళ్ల అప్పల నాయుడు, పతివాడ నారాయణ స్వామి, పెనుమత్స సాంబశివ రాజు, శత్రుచర్ల విజయ రామరాజు, కిమిడి కళా వెంకటరావు వంటి ఉద్దం డులు ఈ నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఉత్తరాపల్లి... శృంగవరపుకోటగా మారింది. సతివాడ, భోగాపురం.. నెల్లిమర్లగా మారాయి. నాగూరు రద్దయి కురుపాం ఆవిర్భవించింది. ఉణుకూరు స్థానంలోకి రాజాం వచ్చింది. తెర్లాం తెరమరుగై బొబ్బిలి నియోజకవర్గంగా మారింది. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఈ నియోజకవర్గాలను గుర్తుచేసుకుందాం.



సతివాడ గ్రామం

సతివాడ నియోజకవర్గం

నెల్లిమర్ల మండల పరిధిలో చిన్న గ్రామం సతివాడ. ఈ నియోజకవర్గం కూడా 1978 నుంచి 2009 వరకు కొనసాగింది. 1994 మినహా మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ పెనుమత్స సాంబశివరాజు ఎన్నికవుతూ వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పలుమార్లు మంత్రిగానూ చేశారు. నెల్లిమర్ల, గుర్ల, గంట్యాడ, బొండపల్లి మండలాల్లో కొన్ని గ్రామాలతో కలసి ఈ నియోజకవర్గం ఉండేది. 2009 నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో బొండపల్లి, గంట్యాడ గజపతినగరం నియోజకవర్గంలోను, గుర్ల, నెల్లిమర్ల ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన నెల్లిమర్ల నియోజకవర్గంలోకి వెళ్లాయి.



తెర్లాం గ్రామం

తెర్లాం

తెర్లాం మండల కేంద్రం. దీని పేరు మీద 2009 వరకు నియోజకవర్గం ఉండేది. తెర్లాం, బాడంగి మండలాలతో పాటు మెరకముడిదాం మండలంలో కొంత భాగం... రామభద్రపురం మండలంలో కొంత భాగంతో కలసి 1972లో ఈ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. అత్యధిక ఎన్నికల్లో తెంటు, వాసిరెడ్డి కుటుంబాల మధ్య పోరు సాగేది. పునర్విభజనలో తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాలను బొబ్బిలి నియోజకవర్గంలో కలిపేయడంతో తెర్లాం నియోజకవర్గం కనుమరుగైంది. ఇక్కడ పోటీ పడిన రెండు కుటుంబాలూ రాజకీయంగా ప్రాధా న్యం కోల్పోయాయి. శంబంగి చినప్పలనాయుడు, బొబ్బిలి రాజుల కుటుంబాల మధ్య ఇప్పుడు రాజకీయ యుద్ధం జరుగుతోంది.

భోగాపురం నియోజకవర్గం

ప్రస్తుతం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించడంతో భోగాపురం పేరు ఖండాంతరాలు దాటుతోంది. మండల కేంద్రం కూడా. దీని పేరుతో 2009 నియోజకవర్గాల పునర్విభజన వరకు శాసన సభలో ప్రాతినిధ్యం ఉండేది. భోగాపురం, పూసపాటి రేగ, డెంకాడ మండలాలను కలుపుకొని 1955లోనే ఈ నియోజకవర్గం ఏర్పాటైంది. కొమ్మూరు అప్పుడుదొర, పతివాడ నారాయణ స్వామి వంటి నాయకులు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. పతివాడ నారాయణ స్వామి నాయుడు రాష్ట్ర మంత్రిగానూ పని చేశారు. ఈ నియోజకవర్గం రద్దయి... పునర్విభజనలో నెల్లిమర్ల ఆవిర్భవించింది.



భోగాపురం గ్రామం



ఉత్తరాపల్లి

కొత్తవలస మండల పరిధిలో చిన్న పల్లె ఇది. 1978 నుంచి 2009 వరకు ఈ గ్రామం పేరుతో నియోజకవర్గం ఉండేది. 1978లో కె.పద్మనాభరాజు, 1983 నుంచి వరసగా 1999 వరకు కోళ్ల అప్పలనాయుడు, 2004లో పూడి మంగపతిరావు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ మండలంలోని ఐదు గ్రామాలు, ఉమ్మడి విశాఖ జిల్లా (ప్రస్తుతం అనకాపల్లి జిల్లా)కు చెందిన కె.కోటపాడు, దేవరాపల్లి మండలంలో 3 గ్రామాలతో కలసి ఈ నియోజకవర్గం కొనసాగేది. ఇక్కడి నుంచచి ప్రాతినిధ్యం వహించిన కోళ్ల అప్పలనాయుడు, పద్మనాభరాజులు రాష్ట్ర మంత్రులుగాను పనిచేసారు. 2009 పునర్విభజనతో ఉత్తరాపల్లి రద్దుకావడంతో కొత్తవలస, ఎల్.కోట, వేపాడ మండలాలు జనరల్‌గా మారిన శృంగవరపుకోటలో చేరాయి.

నాగూరు

గరుగుబిల్లి మండల పరిధిలోని కుగ్రామం నాగూరు. ఈ ఊరి పేరు మీద అర్ధ శతాబ్దానికి పైగా నియోజక వర్గ కేంద్రం ఉండేది. 1955లో ఆవిర్భవించిన ఈ నియోజకవర్గం 2009 పున ర్విభజనలో రద్దయింది. గిరిజన నియోజ కవర్గంగా ఉన్న దీన్ని రద్దు చేసి... పార్వ తీపురం నియోజక వర్గ పరిధిలో ఉన్న గరుగుబిల్లి, కొమరాడ మండలాల్లోని కొన్ని గ్రామాలను కలుపుకొని.. దాదాపుగా నాగూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న మండలాలతో కురుపాం గిరిజన నియోజకవర్గంగా మార్చారు. తొలినాళ్లలో అ డ్డాకుల లక్ష్మనాయుడు, ఆ తరువాత శత్రు చర్ల ప్రతాప్ రుద్రరాజు, వైరిచర్ల విజయ రామరాజు, నిమ్మకజయరాజు, శత్రుచర్ల విజయరామరాజు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. నియోజకవర్గం రద్దయ్యే ముందు సీపీఎంకు చెందిన కోలక లక్ష్మణమూర్తి ఈ నియోజకవర్గం నుంచి శాసన సభలో అడుగుపెట్టారు. శత్రుచర్ల విజయ రామరాజు రాష్ట్ర మంత్రిగానూ వ్యవహరించారు.

ఉణుకూరు

రేగిడి ఆమదాలవస మండల పరిధిలోని తక్కువ జనాభా కలిగిన గ్రామం. రాజాం, వంగర, రేగిడి ఆమదాలవలసలోని కొన్ని గ్రామాలతో కలసి ఉణుకూరు నియోజకవర్గం ఉండేది. 2009 పునర్విభజనలో రద్దయింది. ప్రస్తుతం ఈ గ్రామం రాజాం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో ఉంది. జిల్లాల పునర్విభజనలో శ్రీకాకుళం జిల్లా నుంచి విజయనగరం జిల్లాలో చేరింది. ఉణుకూరు నియోజకవర్గం నుంచి గెలిచిన కిమిడి కళావెంకటరావు రాష్ట్ర హోం మంత్రిగా వ్యవహరించారు. ఇది రాజాం ఎస్సీ నియోజకవర్గంగా మారడంతో ఆయన ప్రస్తుతం విజయనగరం జిల్లా చీపు రుపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

మెజారిటీ ఓట్లు నోటాకు పోలైతే..

(చీపురుపల్లి)



ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులలో అధికంగా ఓట్లు పోలైన వారు గెలిచినట్లు ప్రకటిస్తారు. పోలైన ఓట్లలో అత్యధికంగా నోటాకు పడితే... ఎవరు గెలుస్తారన్నది అందరిలో ఉన్న ప్రశ్న. నోటాకు ఎ క్కువ ఓట్లు పోలయ్యాయంటే.. పోటీ చేసిన వారిలో ఏ ఒక్క అభ్యర్థీ ఓటర్లకు నచ్చలేదన్నదే దానర్థం. అంటే పరోక్షంగా అభ్యర్థులందరూ ఓడినట్టే లెక్క. అదే న్యాయమని చాలా మంది అభిప్రాయ పడతారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలు వేరే విధంగా చెబుతు న్నాయి. నోటాకు అధికంగా ఓట్లు పోలైన సందర్భాల్లో, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోకుండా... ఆ ఓట్లన్నిటినీ రద్దయినవి గానే ఎన్నికల సంఘం పరిగణిస్తుంది. నోటా తరువాత అత్యధింగా ఓట్లు పొందిన వ్యక్తిని గెలిచినట్లు ప్రకటిస్తున్నారు.

వారు సీతయ్యలు

- ఎవరి మాటా వినరు..

(రాజాం రూరల్)

అవును.. నిజమే. వారంతా సీతయ్యలే.. ఎవరి మాటా వినరు.. వారు నమ్మిందే వేదం.. వారంటే కొందరికి ఇష్టం.. మరికొందరికి కష్టం. అయినవాళ్లకు అండగా ఉంటారు.. కానివాళ్లకు మాత్రం గుదిబండగా తయారవుతారు. ప్రతి ఎన్నికలలోనూ వీరు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారు. వారే సంప్రదాయ ఓటర్లు...ఎన్నికల వేళ.. వారికి ఎంతగానో ప్రాధాన్యం ఉంటుంది. నియోజకవర్గంలో తమ బలమేంటో నాయకులు లెక్కలు వేసుకున్నపుడు వీరిదే సింహభాగం. పార్టీలకు అండగా... పెట్టని కోటగా ఈ ఓటర్లే తుది ఫలితాలపై ప్రభావం చూపుతారు. అరుదైన సందర్భాలలో తప్పితే వీరి నిర్ణయంలో ఎలాంటి మార్పూ ఉండదు. ఏళ్లకు ఏళ్లు ఒకే పార్టీని నమ్ముకుంటూ ఆ పార్టీకే పట్టం కడతారు. వీరి విషయంలో దేవుడొచ్చి చెప్పినా వినరని జిల్లాలో చాలా నియోజకవర్గ నాయకులకు అనుభవమే. కుటుంబాలకు కుటుంబాలు... వీధులకు వీధులు.. గ్రామాలకు గ్రామాలు... ఒకే పార్టీకి కంచుకోటగా నిలుస్తారు.. ఈ తరహా ఓటుబ్యాంకుకు వ్యక్తిగత కారణం ఒకటైతే పార్టీపై ఉన్న అభిమానం మరొకటి. పార్టీల వల్ల, ప్రభుత్వాల వల్ల లబ్ధి పొందిన వారి శాతమూ ఎక్కువే. వీరి ఓట్లే అభ్యర్థి విజయానికి కీలకం అంటే అతిశయోక్తి కాదేమో. పదవులు పొంది... పార్టీలు మారుతున్న నేటి రాజకీయాలలో ఒక వ్యక్తినో, పార్టీనో నమ్ముకుని ఉండే ఇలాంటి సంప్రదాయ ఓటర్లకు ఉన్న విలువే వేరు...



హలో.. నన్ను గుర్తుపట్టారా?



(రాజాం రూరల్)

ఓటరు దేవుళ్లకు నమస్కారం.. మీకోసం మళ్లీ వచ్చాను..నన్ను గుర్తుపట్టారా... అధికారులు చెప్పే ఉంటారు.. గతంలో నావల్ల ఏవో తప్పిదాలు జరిగాయని చాలామంది నన్ను తప్పుపట్టారు. అందుకే గతసారికి భిన్నంగా ఈసారి వచ్చాను. ఈసారి జాగ్రత్తగా నన్ను గమనించండి. మీరు ఏ అభ్యర్థికి ఓటు వేయాలని అనుకుంటున్నారో అతని పేరును బాగా పరిశీలించండి. ఓ నిర్ణయానికి వచ్చాక మీరు ఓటు వేయండి. మీ ఓటును మీరే వేయండి... ఇతరులకు అవకాశమివ్వొద్దు. మీరు మీట నొక్కినపుడు కీ అనే శబ్దం వస్తుంది. అలా శబ్దం వస్తేనే మీరు ఓటు వేసినట్లు. మరేనా... ఉండనా మరి.. బాగా గుర్తుంచుకోండి... ఎన్నికల ముందురోజు డబ్బు ఇచ్చాడనో... మందు ఇచ్చాడనో... ఎవరో చెప్పారనో విలువైన ఓటును దుర్వినియోగం చేసుకోవద్దు... గడచిన అయిదేళ్లు ... పోతే నాకేంటని ధీమాగా ... వేసిరేట్ పార్టీకే ఓటువేసి...అసెంబ్లీకి పంపండి...ఉంటాను మరి.

ఇట్లు

= మీ ఈవీఎం

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే జైలే

(గరుగుబిల్లి)

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ నేతలు ఆచితూచి మాట్లాడాలి. ఏమ్మైనా తేడాగా మాట్లాడి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారా ఊచలు లెక్కబెట్టాలి. తస్మాత్ జాగ్రత్త. కొందరు అభ్యర్థులు కులం, వర్గం, మతం, ప్రాంతం పేరుతో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలను అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం నియమావళిలో కఠిన నిబంధనలు రూపొందించింది. ఎన్నికల్లో ఎవరైనా జాతి, మత, కుల, భాష, సమాజం పేరుతో రెచ్చగొడితే ఆర్పీ చట్టం 1951 సెక్షన్, 125 ఐసీసీ సెక్షన్, 153 ఐపీసీ ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. ఓటు కోసం మద్యం, డబ్బులు, ఇతర వస్తువులను తీసుకున్న వారిని కూడా నేరస్తులుగా పరిగణిస్తారు. ఐపీసీ సెక్షన్ 171బి, 171ఇ ప్రకారం లంచంగా పరిగణించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. ప్రస్తుత ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రవాహంపై నిఘా పెంచారు. నజారాలకు లొంగినా... ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా భారీ మూల్యం చెల్లించక తప్పదు.



రాజకీయ కట్టప్పలు



- అభ్యర్థుల్లో గబులు
- ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి

(కొమరాడ)

ఎన్నికల వేళ నేతలకు సరికొత్త చిక్కు వచ్చిపడింది. నిన్న మొన్నటి వరకు ప్రత్యర్థి పార్టీలో ఉన్న నేతలు ఇప్పుడు సొంతవారయ్యారు. ఇంతవరకు బాగానే ఉన్నా నేతలకు ఇప్పుడు కోవర్ట్‌ల భయం పట్టుకుంది. స్వపక్షంలోనే ఉండి పనిచేసే కన్నా ప్రత్యర్థి వర్గంలోకి చేరి వారి అనుపానులను చేరవేయడం ఓ రాజకీయం. స్వపక్షంలోనే కొనసాగుతూ వారి వ్యూహాలను ప్రత్యర్థి పార్టీకి చేరవేయడం మరో కోవర్టు కళ. రాజకీయ పార్టీల గెలుపు ఎత్తుల్లో ఇది కూడా ఓ వ్యూహమే. పార్టీలోకి వచ్చే వారిని కాదనలేరు. అలా అని అందరినీ కోవర్టులుగా చూడలేరు. ఒకరిద్దరు మాత్రం ఈ తరహా వ్యక్తులు కచ్చితంగా ఉంటారని నేతలే నమ్ముతున్నారు. ఒకవిధంగా వీరంతా రాజకీయ కట్టప్పలు. ఎప్పుడు వెన్నుపోటు పొడుస్తారో చెప్పలేం. వచ్చిన చిక్కల్లా ఆ కోవర్టులను ఎలా పసిగట్టడం అనేది మాత్రమే. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ప్రత్యర్థుల శిబిరాల్లో కోవర్టులను ఇప్పటికే మోహరించాయి. వీరి ద్వారానే తమ దగ్గర ఉన్న కోవర్టుల పేర్లు తెలుసుకునే సరికి అవాక్కవడం వారి వంతవుతోంది. ఫలానా వ్యక్తి కోవర్టు అని తెలిసినా బహిరంగంగా అది వెలిబుచ్చలేని వింత పరిస్థితి నేతలది. ఎందుకంటే ఇది ఎన్నికల వేళ కనుక ప్రతి ఓటు, ప్రతినేత విలువైన వారే. దీంతో వారిని పార్టీలోనే ఉంచుతూ... వారి విషయంలో జాగ్రత్త వహిస్తూ ఎన్నికల కార్యం జరిపించుకోవడమే ప్రస్తుతం నేతల ముందు ఉన్న తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నారు.

నేతల్లో టెన్షన్

రాజకీయం అంటేనే ఎదుటి వారి బలాలు, బలహీనతలు తెలుసుకుని వాటికి అనుగుణంగా గెలుపు వ్యూహాలు రచిస్తూ ఉంటాయి. కానీ నిన్న మొన్నటి వరకు తమ వెంట తిరిగిన వారు ఇప్పుడు ఆవలి పక్షాన కనబడుతుండే సరికి వారిలో టెన్షన్ అధికమవుతోంది. వారి లోగుట్టులన్నీ ఆ నేతలకు తెలిసి ఉండడమే అందుకు కారణం. తన అంతరంగీకులుగా మెలిగే ఒకరిద్దరు నేతల వద్ద మాత్రమే ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన వివరాలు పంచుకుంటున్నారు. గోడలకు చెవులు ఉండొచ్చు అనే చందాన అత్యంత రహస్యంగా ఎన్నికల ప్రణాళికలకు పదును పెడుతూ కోవర్టు రాజకీయాలకు చెక్ పెట్టాలనే తలంపుతో నేతలు ఉన్నారు.

భలే అవకాశవాదం

కోవర్ట్‌లకు మరో అవకాశం కూడా ఉంది. ప్రత్యర్థి పార్టీ ప్రయోజనాల కోసం పనిచేసినా.. సొంత పార్టీ గెలిస్తే గుట్టుచప్పుడు కాకుండా ఈ విజయం క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుని ఎంచక్కా ఆ నేత నీడలోనే ఉండొచ్చు. ఇలా కాకుండా ఎవరికోసమైతే కోవర్టు అవతారమెత్తారో వారే గెలిస్తే దర్జాగా మళ్లీ వారి దగ్గరకు వెళ్లిపోయి అక్కడా గెలుపు క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునే సౌలభ్యం కోవర్టులకు మాత్రమే ఉంది.

అందరూ మంచివారే.. కానీ

అధికార పార్టీ మీద అసంతృప్తితో పాటు ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగానో, పార్టీల ఏకపక్ష ధోరణి నచ్చకనో పార్టీలు మారడం సహజం. ఇలా మారే వారిలో చాలామంది నిజంగా నిండు మనసుతో పార్టీ మారేవారే. కానీ ఒకరిద్దరు మాత్రం కోవర్టు రాజకీయం చేస్తుంటారు. ఈ మొత్తంలో వారిని పసిగట్టడమే పార్టీలకు పెద్ద పరీక్ష. ఒక్కోసారి నిబద్ధత కలిగిన నేతను విస్మరించి.. కోవర్టుకే పెద్ద పీట వేసే నేతాగణానికీ కొదవలేదు. అందుకే నేతలూ కోవర్టులతో బహుపరాక్..

కోవర్టులు రకరకాలు

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు వివిధ రకాలుగా కోవర్ట్ ఆపరేషన్ చేపడుతుంటాయి. వాటిలో ముఖ్యంగా ప్రత్యర్థి శిబిరంలోనే ఉంచి దెబ్బతీయడం. ఇటీవల ఓ అభ్యర్థి వద్దకు ద్వితీయ శ్రేణి నేత ఒకరు తాను ప్రస్తుతం ఉన్న పార్టీని వదిలేసి మీ గూటికి వస్తానని వర్తమానం పంపారు. ఆ అభ్యర్థి మాత్రం పార్టీ మారేకంటే అక్కడే ఉండి వారి పథక రచనలన్నీ తనకు చేరవేయాలని... ఇదే తనకు చేసే మేలు అని చెప్పారు. అంతే అటు పార్టీ మారినట్లయింది. ఇటు కోవర్ట్ ఆపరేషన్ మొదలయ్యింది. ఆవల శిబిరంలోకి వెళ్లి వారి నేతలు, కార్యకర్తలతో మమేకమైపోయి... వారి వ్యవహారాలన్నీ గుట్టు చప్పుడు కాకుండా తన సొంత శిబిరం నేతలకు చేర్చడం ఇదో రకం కోవర్టు వ్యవహారం. వీరు తటస్థంగా ఉన్నట్లు కలరింగ్ ఇస్తూ ఏదో ఒక పక్షానికి లోపాయికారిగా పనిచేస్తారు. పోలీసులు నేరుగా డబ్బు ఉన్న చోటుకు వెళ్లి కొన్ని సందర్భాల్లో దాడులు చేస్తుంటారు. ఇదంతా ఈ తటస్థ కోవర్టుల పుణ్యమే. ఇలా కోవర్టులందు రకాలు వేరయా అన్న చందాన వీరితో పెను ప్రమాదం కూడా అభ్యర్థులకు పొంచి ఉందండోయ్.



ఉపాధి కోసం వెళ్లి..

● రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అజయ్(ఫైల్)

సాలూరు రూరల్: ఉపాధి కోసం ఊరికాని ఊరు వెళ్లి, అక్కడ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. కొట్టుపరువు గ్రామానికి చెందిన చింతాడ అజయ్(30) గత కొన్నేళ్ల కిందట ఉపాధి కోసం కృష్ణ జిల్లాలో కైకలూరు వెళ్లాడు. అక్కడ చేపల చెరువులో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి కూర కోసం బైకుతో పట్టణంలోకి వెళ్తుండగా, పశువులు అడ్డంగా వచ్చాయి. వాటిని తప్పిస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గుడివాడలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కొట్టుపరువుకు తీసుకొస్తున్నారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రులు ప్రకాష్, బుచ్చమ్మ రోదిస్తున్నారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.96 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

పాలకొండ: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన కోటదుర్గమ్మ అమ్మవారి హుండీలను సోమవారం తెరిచి లెక్కించారు. గత నెల 28 ఉంచి ఈనెల 29 వరక నగదు రూపంలో రూ.3.96,127లక్షలు వచ్చినట్టు దేవాదాయశాఖ పార్వతీపురం మన్యం జిల్లా కార్యాలయం జూనియర్ సహాయకురాలు వై.ఇందిర తెలిపారు. నగదుతో పాటు బంగారం 33 గ్రాములు, వెండి కేజీ 770 గ్రాములు భక్తులు సమర్పించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఏఎస్ఐ యు.ధర్మారావు, ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ, గ్రూపు దేవాలయాల సిబ్బంది, భక్తులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ జలాలను సంరక్షించుకుందాం

పాలకొండ: ప్రతిఒక్కరూ భూగర్భ జలాలను కాపాడుకోవాలని అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రస్తుతం భూగర్భ జలాలు క్షీణించాయన్నారు. భూగర్భ నీటిమట్టం తగ్గితే రైతులు నీటి లభ్యతను కోల్పోతారని ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆహార ఉత్పత్తి మానవ వ్యవస్థకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. పాలకొండ మండలంలో వీఆర్ రాజుపేట గ్రామంలో 45 ఎకరాల విస్తీర్ణం ఉన్న నరసింహచెరువు ఇప్పటికే బీరువారిందన్నారు. దీని దిగువన ఉన్న ఐదు గొలుసుకట్టు చెరువులకు రెండు ఎకరాలకు సాగునీరు అందడం గగనమే అన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

పాలకొండ: రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఓటరు స్లిప్పుల పంపిణీని సోమవారం ప్రారంభించారు. ఐటీడీఏ పీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు పాలకొండ పట్టణంలోని పీఎస్ నెంబర్-176 గ్రంథాలయాల పరిధిలో ఉన్న ఓటర్లకు ఓటరు స్లిప్పులను వీఆర్వో బలివాడ శ్రీనివాసరావు అందించారు.

సీపీఐ మేనిఫెస్టో విడుదల

పాలకొండ: సీపీఐ రాష్ట్ర సమితి ఆమోదించిన మేనిఫెస్టోను పాలకొండలో సోమవారం జరిగిన నియోజకవర్గ సమావేశంలో విడుదల చేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు, పార్టీ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ ఇండియా కూటమి అభ్యర్థులు అప్పనరస, సవర చిట్టిబాబులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గరుగుబిల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి శిజ్ఞాన శిబిరం ప్రారంభమయ్యింది. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వకు పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, ఆటల పోటీలు, తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారని నిర్వాహకుడు నల్ల మధుసూదనరావు తెలిపారు.

వర్షంతో ఉపశమనం

పాచిపెంట: మండలంలోగల పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఉక్కపోత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. అధిక ఉష్ణోగ్రత నుంచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో సేద తీరారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ తీవ్రత వలన సమీపంలో గల చెట్లు వద్దకు వెళ్లారు.

పింఛన్ల పంపిణీకి పక్కాగా ఏర్పాట్లు

మక్కువ: వచ్చే నెల 1 నుంచి జరిగే పింఛన్ల పంపిణీకి పక్కాగా ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో పి.దేవకుమార్ సోమవారం తెలిపారు. మండలంలో 8,549 మంది పింఛనుదారులు ఉండగా 6,460 మందికి నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనే పింఛన్ జమ చేస్తామన్నారు. 2,089 మంది దివ్యాంగులు, వృద్ధులకు నేరుగా ఇంటికి వచ్చి సచివాలయ సిబ్బంది పింఛన్ అందిస్తారని చెప్పారు. ● **వీరఘట్టం:** పింఛన్‌దారులకు ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ లింక్ అయి ఉన్న బ్యాంకు అకౌంట్‌లో పింఛన్ సొమ్ము జమవుతుందని, అలా లేనివారికి ఇంటింటికి వెళ్లి అందిస్తామని ఎంపీడీవో సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. మండలంలో సుమారు పది వేల పింఛన్లు ఉండగా, వాటిలో 800 పింఛనుదారుల బ్యాంకు అకౌంట్‌కు మొబైల్ నెంబర్ ఆధార్‌కార్డు లింక్ అయి ఉన్నాయని చెప్పారు. మిగిలిన 7వేల మంది పింఛనుదారులకు అధికారులు ఇంటికి వచ్చి అందిస్తారని తెలిపారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

భోగాపురం: రాజాపులోవ గ్రామానికి చెందిన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై ఎస్ఐ పి.సూర్యకుమారి సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపులోవ గ్రామానికి చెందిన ఓ బాలిక(17) ఇంటర్ చదువుతూ ఈ ఏడాదే ప్రథమ సంవత్సర పరీక్షలు రాసి, ఫెయిల్ అయింది. అయితే ఈమె తండ్రి కొన్నేళ్ల కిందట ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. తల్లి ఆ బాలికకు సుమారు మూడేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిపించింది. అయితే రెండేళ్ల కిందట పెద్దల సమక్షంలో వారు విడిపోయారు. ఇటీవల బాలిక తల్లి ఆ అబ్బాయి మంచివాడని అతనితోనే జీవితం కొనసాగించాలని చెబుతూ వస్తోంది. దీంతో బాలిక తనకు అతను ఇష్టంలేదని తల్లికి చెబుతూ వస్తోంది. ఈనేపథ్యంలో మనస్తాపానికి గురైన బాలిక ఈనెల 23న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఒమ్మిలో అగ్ని ప్రమాదం

● పశువుల శాల, రెండు గడ్డి వాములు దగ్ధం


దగ్ధమవుతున్న గడ్డివాములు, పశువుల శాల

నెల్లిమర్ల: ఒమ్మి గ్రామంలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన దుర్గాసి ఎర్రంనాయుడుకు చెందిన పశువుల శాల, రెండు గడ్డి వాములు, రెండు ఎడ్ల బండ్లు, టేకు కలప, ప్లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.3.5లక్షలు ఆస్తి నష్టం ఉంటుందని బాధితుడు తెలిపారు. వాటితో పాటు పక్కనే ఉన్న మరో రెండు ఇళ్లు కూడా పాక్షికంగా దెబ్బతిన్నట్లు గ్రామస్థులు చెప్పారు. విషయం తెలుసుకున్న విజయనగరం అగ్నిమాపక దళ సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనా స్థలాన్ని రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు.

మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం: అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ యు.మహేష్ సోమవారం తెలిపారు. లింగాలవలస గ్రామానికి చెందిన బొత్స సత్యనారాయణ వంద మద్యం సీసాలను తీసుకు వెళ్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది కేఎస్ఆర్ పురం వద్ద మాటువేసి పట్టుకున్నారు. పట్టుబడిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తా

● కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి


నిమ్మలపాడులో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

జియ్యమ్మవలస: నిర్వాసిత సమస్యల పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని, ఒక్క అవకాశం ఇచ్చి ఆదరించాలని కూటమి కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని బిత్రపాడు, బట్లభద్ర, నిమ్మలపాడు, సీమనాయుడు వలస, బాసంగి, బాసంగి గదబ వలస, పెదమేరంగి గ్రామాల్లో సోమవారం ఆమె టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బిత్రపాడు గ్రామం వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ నిర్వాసిత సమస్యల పరిష్కారం విషయంలో టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. టీడీపీ కార్యకర్తలు ఆర్.అప్పలకొండ, గుంపమ్మ, తదితరులు ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో పంపిణీ చేశారు. ● బిత్రపాడులో 20 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. టీడీపీ అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపీపీ బొంగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వరికి మద్దతుగా..

గుమ్మలక్ష్మీపురం: లోవముఠా ప్రాంతంలోని మూలిగూడ, కుందుకు, రాయఘడ, జమ్ము, చాపరాయి, బెండి, బాతుగొడవ, పింగువ గ్రామాల్లో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి, కూటమి అభ్యర్థి జగదీశ్వరిని గెలిపించాలని కోరారు. కద్రక మల్లేశ్వరరావు, మండంగి భూషణరావు, కళావతి తదితరులు పాల్గొన్నారు. ● **కురుపాం రూరల్:** కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరిని, అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను గెలిపించాలని కోరుతూ గుమ్మిడిగూడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో టీడీపీ నాయకులు సోమవారం ప్రచారం చేశారు. పార్టీ మండల కన్వీనరు కలిశెట్టి కొండయ్య ఆధ్వర్యంలో కోలా రంజిత్‌కుమార్, రమణమూర్తి, వెంపటాపు భారతి, మాసయ్య తదితరులు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** మండల కేంద్రంలో సోమవారం టీడీపీ ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ద్వారపురెడ్డి సత్యనారాయణ, అక్కేన మధుసూదనరావు ప్రచారం నిర్వహించారు. అంబటి తవిటినాయుడు, ఎం.తవిటినాయుడు, ముదిలిబాబు విజయవాంకుశం, తదితరులు పాల్గొన్నారు. ● **కొమరాడ:** రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావల్సిన అవసరం ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్ అన్నారు. రాయపురం, తులసివలస, కెమిశీల, లాబేసు, తదితర గ్రామాల్లో టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్ పాత్రుడు ఆధ్వర్యంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తులసివలస గ్రామంలో మోహనరావు ఆధ్వర్యంలో వీరేష్ సమక్షంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: సంధ్యారాణి


విజయ సంకేతం చూపిస్తున్న సంధ్యారాణి

పాచిపెంట: అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కూటమి అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి హామీఇచ్చారు. పణుకువలస పంచాయతీ పరిధిలోగల కందిరి వలస, గుంట మామిడివలస, కోస్టువలస, చినచీపురువలస, పెదచీపురువలస, అలాగే గడివలస, కూనాంబందవలస, గార్లవలస, ఇటికవలస, చాకిరాయివలస గిరిజన గ్రామాల్లో ఆమె సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్‌లకు ఘన స్వాగతం లభించింది. టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో టీడీపీ ప్రభుత్వం వస్తుందని, ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నేరుగా సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు కొత్తల పోలినాయుడు, పిన్నింటి ఈశ్వరరావు, దండి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు. ● కందిరివలసలో వంద మంది గిరిజను లు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు ప్రసాద్‌బాబు సమక్షంలో వీరిని సంధ్యారాణి పార్టీలోకి ఆహ్వానించారు. ● **మక్కువ:** చెముడు గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ చింతల గోపాలకృష్ణమూర్తి, కొయ్యన్నపేట మాజీ సర్పంచ్ కొయ్యాన కాశీ విశ్వనాథం, చెముడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు అర్లి కృష్ణమూర్తి అనుచరులు పాచిపెంట మండలం పనుకువలస ఎన్నికల ప్రచారంలో ఉన్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, పార్టీ నాయకులు మావుడి ప్రసాదరావు, బి.గౌరీశంకర్, గొంగాడ భూషణం, చింతల తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి భారీ చేరికలు


జనసేనలో చేరిన వైసీపీ అసమ్మతి వర్గంతో కూటమి అభ్యర్థి జయకృష్ణ

భామిని: భామిని మండల కేంద్రంలో జనసేన ప్రచారం ఒక్కసారిగా ఊపందుకుంది. భామినిలోని వైసీపీ ఎమ్మెల్యే కళావతి అసమ్మతి వర్గం, యువత సోమవారం జనసేన పార్టీలో చేరారు. కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణ వారికి కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. 25 మంది యువత చేరగా, భామిని ఎంపీటీసీ బిడ్డిక తులసి, నాగేశ్వరరావు, లోపింటి జయరాజు, శంకర్‌తో పాటు 35 మంది, బొడ్డగూడ సర్పంచ్ బిడ్డిక మారతమ్మ, భర్త అనంత, వెంకన్నతో పాటు బొడ్డగూడ, నవరపాడు, బూర్జిగూడకు చెందిన 75 మంది చేరారు. అలాగే నులకజోడుకు చెందిన కోలక ఆఫీసుతో పాటు ఐదు కుటుంబాలు చేరాయి. ఈసందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ తనకు సహకరించిన ప్రతి ఒక్కరిని గౌరవిస్తామన్నారు. భామిని మండలాన్ని అభివృద్ధి చేసేందుకు పాటుపడతానని హామీ ఇచ్చారు. అనంతరం గజపతినగరం, అనంతగిరి, మణిగ, బొడ్డగూడ, నవరపాడు, బూర్జిగూడ గ్రామాల్లో జయకృష్ణ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

జయకృష్ణకు మద్దతుగా..

వీరఘట్టం: కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణను గెలిపించాలని కోరుతూ సోమవారం వీరఘట్టంలోని మందిరం వీధిలో టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో గాజు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కూటమి నాయకులు జామి లక్ష్మీనారాయణ, బల్లా హరి, పప్పల మహేష్, తుమ్మల రమేష్, అచ్యుతరావు, కోటప్పడు, భోగి చం ద్రమౌళి, ప్రవీణ్ పాల్గొన్నారు. ● కూటమి అభ్యర్థి జయకృష్ణకు మద్దతుగా కుంబిడి ఇచ్చాపురం పంచాయతీలో బల్లగూడ, గంగంపేట, కుంబిడి గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు సోమవారం ప్రచారం చేశారు. కూటమి నాయకులు ఉదయన ఉదయ్‌భాస్కర్, నిమ్మక పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● కూటమి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర


పార్వతీపురంలో ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి విజయచంద్ర,


ఆయన సతీమణి అనూష

సీతానగరం: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. మండలంలోని కామంద్రవలస, పాపమ్మవలస, గుచ్చిమి గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యంనాయుడు, గోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో ఆయన సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి లక్ష్మణరావు, బుడితి గోపాలకృష్ణ, మరడాన గౌరునాయుడు బూరాడ చిరంజీవి, మరిశర్ల సంజీవినాయు డు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** జిల్లా కేంద్రంలో కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర సోమవారం ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా కొత్తపల్లి గీతకు కమలం గుర్తుపై ఓటు వేసి, గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు ద్వారపురెడ్డి శ్రీదేవి, ద్వారపూడి శ్రీనివాసరావు, విజయచంద్ర సతీమణి అనూష, తేజోవతి, వెంకటనాయుడు, బార్నాల సీతారాం, కోల మధు, కృష్ణమోహన్ , గౌరునాయుడు, గొట్టా శివ, జొన్నాడ శ్రీదేవి, కొత్తకోట ప్రసాద్, చందక అనీల్, ఆగూరు మణి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

● **పార్వతీపురం రూరల్:** పట్టణంలో నవ్విరి కాలనీకి చెందిన సుమారు వంద కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వీరిని కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ సీనియర్ నాయకుడు మజ్జి కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆరో వార్డుకు చెంది మజ్జి భాను ప్రకాష్ నాయకత్వంలో వీరంతా పార్టీలో చేరారు. కూటమి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, ఎం.కృష్ణమోహన్, పారిశర్ల అప్పారావు, శివ తదితరులు పాల్గొన్నారు. ● నామినేషన్లు ఉపసంహరించుకున్న స్వతంత్ర్య అభ్యర్థులు ఎ.మోహన్‌రావు, పి.అప్పారావు- బోనెల విజయచంద్రను తన స్వగృహంలో సోమవారం కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మద్దతు పలకడం ఆనందంగా ఉందన్నారు. నాయకులు మజ్జి కృష్ణమోహన్, గొట్టాపు వెంకటనాయుడు పాల్గొన్నారు.

ఘర్షణలకు తావు లేకుండా చర్యలు


రావివలసలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

గరుగుబిల్లి: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఘర్షణలకు తావు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టామని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. మండలంలోని మరుపెంట, గొట్టివలస, ఉల్లిభద్ర, సీతారాంపురం, కొంకడివరం, రావివలసతో పాటు పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరగనున్న ఎన్నికలపై అవసరమైన ప్రణాళికలను రూపొందించామని చెప్పారు. ఈ పరిశీలనలో చినమేరంగి సీఐ బి.మంగరాజు, ఎస్ఐ అమ్మన్నరావు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

జియ్యమ్మవలస: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని చినమేరంగి సీఐ బి.మంగరాజు, ఎస్ఐ చిన్నంనాయుడు కోరారు. మండలంలోని చినమేరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలోగల సమస్యాత్మక గ్రామాలైన చినకుదమ, చింతల బెలగాం, కన్నపదొరవలసలను సీఐ బి.మంగరాజు, ఎస్ఐ చిన్నంనాయుడు సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా గ్రామాల్లో ఎటువంటి తగాదాలు, వివాదాలు చోటు చేసుకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ సభకు సన్నాహాలు

ఒడిశా

రాయగడ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ త్వరలో రాయగడ జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో సభ నిర్వాహణపై ఎంపీ, లోకసభ అభ్యర్థి సప్తగిరి శంకర్ నివాశంలో సోమవారం ఆయన అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొ న్నారు. సభ ఎక్కడ నిర్వహిం చాలి, ఏవిధంగా ప్రచార ఏర్పాట్లు చేయాలి, అనే పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో శాసనసభ అభ్యర్థి అప్పలస్వామి కద్రక, కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్ర సాద్ పండా, ఉపాధ్యక్షుడు సంకర్షన మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వారందరికి ఉలకా కుండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఓటు హక్కుపై అవగాహన

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా కలెక్టర్, ఎన్నికల అధికారి మనోజ్ సత్యవాన్‌మహాజన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లక్ష్మీపతి సంఘానికి, హయ్యర్ సెకండరీ పాఠశాల, డిగ్రీ కళాశాల, అమ్లాపేట తదితర ప్రాంతాల యువ ఓటర్లకు సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బూత్ లెవల్ వర్కర్లు పాల్గొన్నారు.


ఓటుపై అవగాహన కల్పిస్తున్న బూత్‌లెవెల్ వర్కర్లు

బీఎస్సీ పారా మెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన బీఎస్సీ పారా మెడికల్ ఫలితాల్లో బొల్లినేని కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎనస్తీషియా విభాగంలో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన ఎస్.ఛటోపాధ్యాయను కళాశాల యాజమాన్యం సోమవారం అభినందించింది. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ- డయాలసిస్ విభాగంలో కళా శాల విద్యార్థి కోరాడ తరుణ్‌కుమార్ యూనివర్సిటీ స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించారన్నారు. ఈ పరీక్షల్లో 61 మంది విద్యార్థులకు గాను 11 మంది డిస్టింక్షన్‌లో, 44 మంది ప్రథమ శ్రేణి, ముగ్గురు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసిన వారికి బీఎస్సీ, డిప్లమో పారామెడికల్, జీఎస్ఎమ్, బీపీటీ కోర్సుల్లో, ఇంటర్ ఫెయిల్ అయిన వారికి ఓటి అసిస్టెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ముందుగానే విద్యాకానుక కిట్లు అందించాలి

● విజయనగరం డీఈవో ప్రేమ్‌కుమార్

వంగర: పాఠశాలల ప్రారంభానికి ముందుగానే విద్యా కానుక కిట్లు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం వంగర జడ్పీ పాఠశాలలో విద్యాకానుక కిట్లు బద్రపరచటానికి ఉపయోగించిన గదులను పరిశీలించారు. జిల్లా కేంద్రం నుంచి రెండురోజుల్లో కిట్లు సరఫరా కానున్న నేపథ్యంలో వచ్చిన వాటిని బద్రపరచాలన్నారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. సిబ్బంది కిరణ్, పారయ్య, తవిటినాయుడు, గణపతి, రెడ్డివాసు ఉన్నారు.

ఉచిత పుస్తక పంపిణీ

విజయనగరం రింగురోడ్డు: మహాకవి గురజాడ అప్పారావు స్వగృహంలో సహజ సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత పుస్తక పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రధాన కార్యదర్శి దయానంద్ అన్నారు. గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన ఉచిత పుస్తక వితరణ కార్యక్రమం సోమవారం ప్రా రంభించి ఆయన మాట్లాడారు. ప్రపంచ పుస్తక దినో త్సవం సందర్భంగా పుస్తక ప్రేమికుల కోసం పుస్తక విత రణ చేయడం అభినందనీయమన్నారు.